# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 31-05-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా ఈరోజు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.**

2. **విద్యార్థులకు పాఠశాల దశ నుంచే విద్యతోపాటు జీవన నైపుణ్యాలు బోధించాలని ఇంటర్మీడియెట్ విద్యాకమిషనర్ సౌరభ్ గౌర్ అన్నారు.**

3. **తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామిని సీనియర్ బిజేపి నాయకులు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఈరోజు దర్శించుకున్నారు.**

4. **వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్ యూజీ-2024 పరీక్ష ప్రాథమిక కీని జాతీయ పరీక్షల నిర్వహణ సంస్థ విడుదల చేసింది.**

5. **రాష్ట్రంలో మరో రెండు రోజుల పాటు పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది.**

==========================

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా ఈరోజు రాష్ట్రంలోని పలు జిల్లాలో పొగాకు ఉత్పత్తుల వాడకం వలన ఆరోగ్యంపై కలిగే దుష్ప్రభావాల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ – స్విమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక అవగాహనా కార్యక్రమంలో స్విమ్స్ ఉపకులపతి ఆర్.వి.కుమార్ మాట్లాడుతూ.... యువత పొగాకు దూరంగా ఉండాలని కోరారు. చిత్తూరులో ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన పొగాకు వ్యతిరేక దినంలో చిత్తూరు నగరపాలక సంస్థ కమీషనర్ జె.అరుణ పాల్గొని, మాట్లాడుతూ.... పొగాకు, మత్తుపదార్థాలు ఆరోగ్యానికి హానికరమని తెలిపారు. సత్యసాయి జిల్లాలో పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా పుట్టపర్తిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పొగాకు సేవించడం వలన నోటి క్యాన్సర్, గుండె జబ్బుల వంటి రోగాలు వస్తాయని తెలిపారు. జాతీయ పొగాకు నియంత్రణలో భాగంగా శ్రీకాకుళ నగరంలో ఈరోజు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి ఎం. రామారావు మాట్లాడుతూ..... "పొగాకు ఉత్పత్తుల నుంచి పిల్లలను దూరంగా ఉండేలా చేయడం" అనే ఇతివృత్తంతో ఈ ఏడాది పొగాకు వ్యతిరేక దినాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు.

---------------------------

విద్యార్థులకు పాఠశాల దశ నుంచే విద్యతోపాటు జీవన నైపుణ్యాలు బోధించాలని ఇంటర్మీడియెట్ విద్యాకమిషనర్ సౌరభ్ గౌర్ అన్నారు. విజయవాడలోని సమగ్ర శిక్షా రాష్ట్ర కార్యాలయంలో నిన్న మెల్బోర్న్ విశ్వవిద్యాలయం సహకారంతో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పైలెట్ కెరీర్ విద్య శిక్షణ అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సౌరభ్ గౌర్ మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ, ఇంటర్మీడియెట్ విద్యాశాఖ సంయుక్తంగా పైలెట్ కెరీర్ విద్య శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తాయని, అవసరమైన ప్రణాళికను తయారు చేయాలని అధికారులకు సూచించారు. గత ఏడాది గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో ఎంపిక చేసిన 100 ప్రభుత్వ పాఠశాలలు, 20 జూనియర్ కళాశాలల్లో 8 నుంచి 12 తరగతుల విద్యార్థులకు కెరీర్ విద్యపై శిక్షణ అందించామని తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో మరింత సమర్థంగా శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన కార్యాచర చేపట్టాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు.

---------------------------

తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామిని సీనియర్ బిజేపి నాయకులు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఈరోజు కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ మహద్వారం వద్ద అమిత్ షాకు టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా, టీటీడీ ఈఓ ధర్మారెడ్డి అమిత్ షాకు స్వామివారి ప్రసాదాలను అందజేసి, శేషవస్త్రంతో సత్కరించారు.

---------------------------

వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ యూజీ-2024 పరీక్ష ప్రాథమిక కీని జాతీయ పరీక్షల నిర్వహణ సంస్థ-ఎన్‌టీఏ నిన్న విడుదల చేసింది. ప్రాథమిక కీలో అభ్యంతరాలను విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా తెలియపరచవచ్చని ఎన్‌టీఏ పేర్కొంది. అభ్యంతరాలకు సంబంధించి ఒక్కో ప్రశ్నకు 200 రూపాయల చొప్పున రుసుమును చెల్లించాల్సి ఉంటుందని తెలిపింది. జూన్ 14వ తేదీన ఫలితాలతో పాటే తుది కీ విడుదల ఉంటుందని జాతీయ పరీక్షల నిర్వహణ సంస్థ వివరించింది.

---------------------------

జూన్ 4 వ తేదీన జరిగే ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రామకృష్ణ తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులతో నిన్న విజయవాడలో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ రామకృష్ణ మాట్లాడుతూ... ఇబ్రహీంపట్నంలోని నిమ్రా, నోవా కళాశాలల్లోని రెండు కేంద్రాల్లో విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు జిల్లాలోని 7 శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 144 సీఆర్ పీసీ, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని, ఓట్ల లెక్కింపు జరిగే ప్రాంతాన్ని రెడ్‌జోన్‌గా ప్రకటించామని తెలిపారు.

---------------------------

ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో సుదీర్ఘకాలం వివిధ హోదాల్లో సేవలందించిన ఇద్దరు సిబ్బంది ఈరోజు పదవీ విరమణ చేశారు. డిప్యూటీ డైరెక్టర్, ఇంజనీరింగ్ ఎం.శోభాదేవి సీనియర్ స్టోర్ కీపర్ ఎన్.సి.హెచ్.ఎస్.

వెంకటాచార్యులు పదవీ విరమణ చేసిన వారిలో ఉన్నారు. ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పదవీ విరమణ చేసిన సిబ్బందిని సత్కరించి, వారి సేవలను పలువురు వక్తలు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆకాశవాణి విజయవాడ కేంద్రం ఇంజనీరింగ్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎం.సోమేశ్వరరావు, కార్యక్రమాల విభాగాధిపతి బి.వెంకటేశ్వర్లు, ప్రాంతీయ వార్తా విభాగాధిపతి శ్రీసాయి వెంపాటి, సీనియర్ పరిపాలనాధికారి జె.సూర్యనారాయణలతో పాటు ఆకాశవాణి సిబ్బంది పాల్గొన్నారు.

---------------------------

క్షయవ్యాధి నివారణే లక్ష్యంగా బీసీజీ టీకా ప్రక్రియను అమలుచేస్తున్నామని రాష్ట్ర టీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ పేర్కొన్నారు. నిన్న పల్నాడు జిల్లాలో జరిగిన బీసీజీ టీకా పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ, బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవటం వలన భవిష్యత్తులో క్షయవ్యాధి రాదని, 60ఏళ్లు నిండిన వృద్ధులు అందరూ బీసీజీ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించుకోవాలని కోరారు.

---------------------------

ప్రసూతి, శిశు మరణాల రేటును తగ్గించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం బహుముఖ విధానాన్ని అనుసరిస్తోందని వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి కృష్ణబాబు అన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల వైద్య ఆరోగ్యశాఖాధికారులతో విజయవాడలో నిన్న నిర్వహించిన ప్రసూతి, ప్రసవ, శిశు మరణాల పర్యవేక్షణ– సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రసూతి మరణాలు, ఐదేళ్లలోపు శిశు మరణాల రేటును 2030 నాటికి గణనీయంగా తగ్గించాలన్న లక్ష్యంతో బహుముఖ విధానాన్ని రూపొందించామన్నారు. మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, ప్రత్యేక నవజాత సంరక్షణ యూనిట్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడం ద్వారా మరణాల రేటులో గణనీయమైన తగ్గుదల నమోదయిందని తెలిపారు. రాష్ట్రం మొత్తం మీద నవజాత శిశు సంరక్షణను అందించడానికి వెయ్యి 55 పడకలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో నేషనల్ క్యాడెట్ కార్ప్స్– ఎన్ సీ సీ డైరెక్టరేట్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు ఎన్ సీసీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వి.మధుసూదన్ రెడ్డి చెప్పారు. నిన్న గుంటూరులో ఎన్సీసీ వార్షిక తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్సీసీ కార్యాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో గుంటూరు, తిరుపతి, కర్నూలు, కాకినాడ, విశాఖలలో ఎన్సీసీ గ్రూప్‌లు ఉన్నాయని అన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఎన్సీసీ గ్రూప్‌లను విస్తరించి, మరింత విస్తృతంగా శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఎన్సీసీ శిక్షణతో విద్యార్థులకు సమాజం, దేశంపై బాధ్యత, గౌరవం పెరుగుతాయని, క్రమశిక్షణ కలిగిన పౌరులుగా ఎదుగుతారని పేర్కొన్నారు. ఎన్సీసీ శిక్షణ పొందిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ ఉందని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో మరో రెండు రోజుల పాటు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల మేర అధికంగా పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్, యానాం దిగువ ట్రోపో ఆవరణంలో పశ్చిమ దిశగా గాలులు వీస్తుండటంతో రాష్ట్రంలో అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయని వాతావరణ అధికారులు తెలిపారు. కాగా, ఈరోజు, రేపు కోస్తా, రాయలసీమలో ఒకట్రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

మరోవైపు కేరళలో ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు జూన్ 2, 3 తేదీల నాటికి రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లోకి విస్తరించే అవకాశాలున్నాయని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

---------------------------

వెలగపూడి రాష్ట్ర సచివాలయంలోని మంత్రుల కార్యాలయాలను, స్వాధీనం చేసుకునేందుకు సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.. జూన్ 4వ తేదీన ఎన్నికల లెక్కింపు నిర్వహించనున్న క్రమంలో కొత్తగా ఏర్పడే ప్రభుత్వంలో మంత్రులకు కేటాయించేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఇందుకోసం జూన్ 3వ తేదీన అన్ని మంత్రుల పేషీలు, ఛాంబర్లను స్వాధీనం చేసుకుంటామని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆయా కార్యాలయాల సిబ్బంది సచివాలయం నుంచి ఎలాంటి పత్రాలు, వస్తువులు బయటకు తీసుకెళ్లొద్దని ఆదేశించింది.

---------------------------

భద్రత, ఆధునికీకరణ పనుల నేపథ్యంలో రేపు సికింద్రాబాద్-సిల్చార్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును రద్దు చేసినట్లు వాల్తేర్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ -డీసీఎం కె.సందీప్ తెలిపారు. వీటితో పాటు సంబల్‌పూర్ డివిజన్‌లో పలు రైళ్లును దారి మళ్లించి నడపనున్నామన్నారు. జూన్ 6 నుంచి 12 వరకు ఎర్నాకుళం-టాటా, జూన్ 7 నుంచి 14 వరకు టాటా-ఎర్నాకుళం రైళ్లను వయా విజయనగరం, ఖుర్ధారోడ్, కటక్, జాఖాపూర, జరోలి మీదుగా దారి మళ్లించనున్నట్లు తెలిపారు.

======================